మీదో ... ప్రేమ ఉంది ... వాళ్ళ హృదయాలు ప్రేమతో తొణికిసలాడుతున్నై...కాని అది దేశంమీదికి మళ్ళింది ... అవును."

—తానో ... తన సంగతి ఆలోచించుకుంటే తనకే చికాకు పుట్టింది. తాను వేసుకున్న ఇస్త్రీ బట్టలమీద అసహ్యం పుట్టింది. నున్నగా దువ్వుకున్న క్రాపుమీద అసహ్యం పుట్టింది.

"ప్రేమ! దేశం!!"

బస్సు ఆగింది.

అతడు నిలబడ్డాడు.

కండక్టరు అడిగాడు, "వస్తారా?"

"రాను."

బస్సు వెళ్ళిపోయింది.

అతడు కూర్చున్నాడు. అలాగే కూర్చున్నాడు. ఆ చెట్టు క్రిందే!

★

# భూ త ద య

"నువ్వు దేశానికి చాలా అపకారం చేస్తున్నావు. నీ తృప్తి సుఖం నీదిగాని, ఇతర్ల సంగతి ఆలోచించవు," అన్నాడు.

నా కార్యక్రమం వేసి, ఎవ్వరా అని తిరిగి చూశాను. నాపక్కనే కూర్చుని వున్నాడు. చింపిరిగుడ్డల్లో, మాసిన గడ్డ

ముఖతో, పీక్కుపోయిన బుగ్గల్తో, వికారంగా వున్నాడు. చూపుల్లో మాత్రం తీవ్రతా, ఆవేదనా, ఆకలీ...

"నిన్నే!" అన్నాడు.

నేచేసిన ఘోరకృత్యం ఏమీలేదు. బిచ్చగాడొకడు, 'వారం రోజుల్నించి దారకంలేదుదాబూ,' అని ప్రాధేయపడితే నాలుగు డబ్బులిచ్చి పంపాను. దానికేమిటి 'దేశం' అంటాడు; అపకారం అంటాడు; ఆలోచించనంటాడు! ఆకారానికి మించిన మాటలూ, మాటలు చాలని భావాలూ!

"మాట్లాడవేం? అవున్లే, ఎందుకు మాట్లాడుతావు! క్రియచేసి వూరుకుంటే, దాని అపకారం అదే చేసుకుంటూ పోతుంది—" అన్నాడు.

అతని ధోరణి నాకేమీ అర్థంకాలేదు, అనవసరంగా జోక్యం కలిగించుకున్నందుకు మనస్సుకి కష్టంవేసింది, జవాబు చెప్పొద్దనుకున్నాను. కాని, అతని చూపులు! వాటిని భరించటం ఎలా? తప్పించుకోవటం ఎలా? అడిగాను. "నేనేం చేశాను? వారం రోజుల్నించీ తిండిలేదన్నాడు, నాలుగు డబ్బులిచ్చాను."

అగస్మాత్తుగా అతని వైఖరి మారిపోయింది. చూపుల్లోని ఆవేదన మందగించింది. చలితో వొణికిపోతున్నట్లు వొళ్ళు ముడుచుకొని, కొంచెం ముందుకు జరిగి, క్షణం నన్ను పరిశీలించి, "అతడూ అలాగే అడిగాడు. నేనూ ఇలాగే ఇచ్చాను." అని నిట్టూర్చాడు.

ఎతడు ? ఎలా అడిగాడు ? ఇతడో ! ఎలా ఇచ్చాడు ?
ఇంతకీ అతడడిగిందేమిటి, ఇతడిచ్చిందేమిటి ? ఎందు కిచ్చాడు ?
తెలుసుకోవాలనే కుతూహలం నాకెక్కువయింది. "ఏమిటి?"
అని ప్రశ్నించాను.

అతడు మాట్లాడలేదు. అతని దృష్టి ఇక్కడున్నట్లేలేదు.

"ఏమిటి ?" మళ్ళీ అడిగాను.

మరొక క్షణం అతడు మాట్లాడలేదు. అతని కళ్ళు వందసంవత్సరాలనాటి చరిత్రను జ్ఞాపకం తెచ్చుకుంటున్నట్లు కుంచుకు పోయినయి. చివ్వరికి నావంకకు తిరిగాడు. నన్ను ఎగాదిగా చూశాడు. "చెపుతాను" అన్నాడు.

ఇదంతా పార్కులో జరిగింది. పార్కు చుట్టూవున్న ఇళ్ళల్లోని ఎలెక్ట్రిక్ దీపాలే ఆధారం. మధ్యలో మేం కూర్చున్నాం. రేడియో "ఈనాటి మద్రాసు మార్కెట్టు ధరలను" చెబుతూవుంది. "బంగారం టోకుధర..." అంటూ వుంది. గేట్లో పప్పులు అమ్మేకునే గుజరాతీవాడు గంట గణ గణ మోగిస్తున్నాడు. జనం చెదురు బదురుగా కూర్చొని, కబుర్లు చెప్పుకుంటున్నారు. అతడు తన కథ ప్రారంభించాడు.

"ఇక్కడే జరిగింది – ఈ పార్కులోనే! పద్నాలుగు సంవత్సరాలనాడు," అన్నాడు.

నే నాగలేకపోయాను. " ఏం జరిగింది ? " అని ప్రశ్నించాను.

"చెపుతున్నాను" –మొదట్లో నట్లుకొట్టాడు. తబ్బిబ్బు పడ్డాడు. కాని తర్వాత పొంగిన సముద్రంలాగా నడిచింది కథ. అనవసరమైన సంగతులు మాత్రం చాలా చెప్పాడు.

మధ్య మధ్య ప్రేమని గురించి తన సొంత అభిప్రాయాలు వెలి బుచ్చాడు. వాటి అవసరం అట్టేలేదు. అసలు కథ చెబుతాను.

అతడు వెంకటశాస్త్రి కొడుకు, వెంకటశాస్త్రి పేరు పొందిన ప్లీడరు. తన వృత్తిలో చాలాడబ్బు గడించి, కొడుక్కి అప్పగించాడు. పిత్రార్జితం పుష్కలంగా వుంటంవల్ల గోపాల్రావు ఏ వృత్తిలోనూ ప్రవేశించక, కులాసాగా కాలం గడిపే వాడు. స్నేహితుల్తో కలసి తిరగడం, సోషలిస్టు పుస్తకాలు చదవటం, నేను సోషలిస్టుని అని చెప్పుకోవటం – అంతే అతని నిత్య జీవితం. ఒకరోజు అతడు యథాప్రకారం సాయంకాలం పార్కుకి షికారు వెళ్లాడు. దూరంగా బెంచీమీద ఒకయువతి కూర్చొనివుంది. ఒక్కతే కూర్చొని మెడపైకెత్తి, పూల చెట్టుని చూస్తూవుంది. గోపాల్రావు ఆమెను చూశాడు. నెమ్మదిగా దగ్గరకు వెళ్ళాడు.

ఆమె చూసింది.

అతడు చూశాడు.

చూపులు కలిశాయి.

ఆమె హృదయం కొట్టుకుంది.

అతని హృదయం కొట్టుకుంది.

ప్రేమాంకురమయింది.

ఆమె నిలబడలేక పోయింది.

అతడు కూర్చోలేక పోయాడు.

మాటలు కలిశాయి.

అప్పట్నించీ ఇద్దరూ రోజూ అక్కడే కలుసుకునేవారు.

ప్రథమ పరిచయంలోనే ఈవిధంగా మనస్సులు కలవటంవల్ల వాళ్ళప్రేమ చాలా పవిత్ర మయిందనుకునేవాడు. ఆ రోజుల్లో గోపాలరావుకి ప్రపంచమంతా ఆమెతోనే వుండేది. స్నేహితుల్ని వొదిలేశాడు. సోషలిజం మానేశాడు. పగలంతా సాయంకాలం కోసం ఎదురు చూశేవాడు. సాయంకాలం పార్కులో ఆమెను కలుసుకునేవాడు. రాత్రిళ్ళు ఆమెనుగురించి కలలు కనేవాడు. ఆమె కూడా అలాగే వుండేది. అత డెంత ముందొచ్చినా అతనికంటే ముందొచ్చేది. అదే బెంచీమీద కూర్చొని అతనికోసం నిరీక్షిస్తూవుండేది. ఇద్దరూ రాత్రి కలల్నిగురించి చెప్పుకునేవాళ్ళు. ఇలా కొన్నాళ్ళు గడిచినయి. కాని, ఎన్నడూ వాళ్ళు కలల విషయం తప్ప మరో విషయం మాట్లాడుకోలేదు. లేకపోతే, ఇలాంటి సంభాషణ:—

"గాలి బాగుంది"

"పువ్వులో ?"

"నవ్వుతున్నయి"

"గాల్లో ?"

"జోలపాటలు పాడుతూవుంది."

"వెన్నెలో ?"

"ఆహా !"

"చంద్రుడో !"

"సిగ్గుపడుతున్నాడు."

ఇద్దరూ నవ్వుకునేవారు. అంతే! ఎన్నడూ ఇలా మాట్లాడుకునేవారుకాదు.

"నీపేరు ?"

ఆమెసిగ్గు—

"చెప్పవ్ ?"

"కమల"

"ఆహా, పేరే మధురం ?"

"మీపేరు ?"

ఆమె తన్మయత్వం—

"మీ తలిదండ్రులపేరు ? వారల ఉద్యోగం ?"

ఇలాంటి సంభాషణలు బొత్తిగా జరక్కపోవటంవల్ల వాళ్ళకి ఒకళ్ళ నొకళ్లు ప్రేమించుకుంటున్నామనే విషయం తప్ప మిగిలిన విషయాలేమీ తెలియవు. ఇలా జరుగుతుండగా ఒక రాత్రి గోపాలావుకి కలరాలేదు. కలరాకపోవటంవల్ల రాత్రంతా నిద్రపట్టలేదు. ఆందోళన! అసంతృప్తి! ఏదోబాధ! ఎంత ఆలోచించినా, కారణం కనపట్టంలేదు. అతని కప్పుడు తెలిసింది. ఇలా ఎక్కువరోజులు జరగటానికి వీల్లేదు. ఆ పిల్ల తనదై పోవాలి. ఆ పిల్ల మీద తనకు హక్కు ఏర్పడాలి. వీలయినంత త్వరగా పెళ్లి జరిగిపోవాలి. పెళ్ళిసంగతి జ్ఞాపకంరాగానే అతని మనస్సు చివుక్కుమంది. అతడిప్పటివరకూ ఆ పిల్ల మంచి చెడ్డలే కనుక్కోలేదు—పెళ్ళిసంగతే ఎత్తలేదు. ఏమనుకుంటుందో! ఇవ్వాళే ఆ పిల్లతో చెప్పి, ఆమె తండ్రితో మాట్లాడి ముహూర్తం నిశ్చయించే ఏర్పాట్లుచెయ్యాలి. హఠాత్తుగా మరో ఆలోచన తట్టింది. ఆ పిల్లతండ్రి ఎవ్వరు ? బహుశా పోలీసు సూపరింటెండెంటయ్యి వుంటాడు. తప్పకుండా రిటైరయ్యి వుంటాడు. పుస్తీలూ, బుగ్గమీసాలూ!...

"మీ అమ్మాయిని నేను ప్రేమించాను." అని చెబుతాను.

ఆ పిల్ల తలుపు సందుల్లోనుంచి చూస్తూ వుంటుంది.

"ప్రేమ! ప్రేమ!!" అంటాడు.

"మీా కాలంలో ఈ సరుకు ఎక్కువ దొరికేదికాదు. కాని ఇప్పుడు..."

"ఎక్కడబడితే అక్కడే దొరుకుతూ వుందా?" అని పోలీసు ఉద్యోగి అడుగుతాడు. తాను నవ్వుతాడు.

అతడు చివ్వరికి ఇలా అంటాడు. "ప్రేమో గీమో నా కవన్నీ తెలియవు. ముందు నీ ఆస్తెంతో చెప్పు."

గోపాల్రావు కొంచెంసేపు పెద్ద ఆస్తిలేనట్లు నటిద్దామను కున్నాడు. "ఆ స్తిదేముందిలెండి. రెండు నిండు హృదయాలు దబదబా కలవాలిగాని..."

"అవే కలుస్తయి. ఆ స్తిసంగతి చెప్పవయ్యా?" అని సూప రింటెండెంటు కోపంగా అడుగుతాడు. మీాసంకూడాతిప్పుతాడు. అతని కూతురు తలుపు సందుల్లోనుంచి, భయంగా, దీనంగా చూస్తుంది. అప్పుడు చెబుతాడు — "ఏదో ఒక లక్షరూపాయిల కన్నా వుండక పోతుందా?"

సూపరింటెండెంటుసంతోషంవర్ణించలేం. వెంటనేతన్నుకౌగ లించుకుంటాడు. అతని కూతురు ఆనందబాష్పాలు రాలుస్తుంది.

గోపాల్రావు ఇలా ఆలోచించుకుంటూ వుండగా బయట నుంచికేకలు వినిపించినయ్.

"బాబూ?"

"నిన్నే బాబూ!"

"రక్షించు తండ్రీ!"

"నీకడుపున పుడతా"

అతడు యథార్థ ప్రపంచంలోకి వచ్చాడు. సూపరింటెండెంటుకి బదులు, కుర్చీలూ, బెంచీలూ కనిపించినయ్. తలుపు చాటున వున్న ప్రియురాలికి బదులు, టేబుల్ మీదవున్న సిరాబుడ్డి కనిపించింది. ఆమె ఆనందాశ్రువులకు బదులు, వొలికిన సిరా బల్లమీదనుంచి వొక్కొక్క బొట్టు పట్టం కనిపించింది. తనవెర్రి వూహాలకు తనలో తాను నవ్వుకున్నాడు. మళ్ళీ బయటనుంచి కేకలు వినిపించినయి.

"ఒక్క ముద్ద బాబూ"

"చెయ్యి విడిలించు బాబూ"

"రక్షించు తండ్రీ"

"నీకడుపున పుడతా"

ఈ పిలుపుల్నించి అతడు తప్పించుకో లేక పోయాడు. ఈ యథార్థప్రపంచం అతని మనస్సుని కలవరపరిచింది. కాని వూహా ప్రపంచాన్నుంచి తప్పించుకోగలడు గాని, తాను నివసిస్తూ అందులో ఒకభాగమైన యథార్థప్రపంచాన్నుంచి ఎలాతప్పించుకోవటం? బయటికి వెళ్ళాడు. వాకిట్లో బిచ్చగాడున్నాడు. "వారంరోజుల్నించీదారకం లేదుబాబూ! పిల్లలుశోషొచ్చిపడ్డారు. తండ్రీ! రక్షించు..." అని కాళ్ళు పట్టుకున్నాడు. గోపాల్రావు బాధపడ్డాడు. ఇతనికీ పిల్లలున్నారు. ఇతనికీ కుటుంబం వుంది. ఈ నిర్భాగ్యుడికీ బతికే హక్కుంది. ఈ నిర్భాగ్యుడూ మానవుడే!

గోపాల్రావు జేబులోనుంచి తీసి బిచ్చగాడికి అయిదురూపాయిలిచ్చాడు. బిచ్చగాడు చేతులోవున్న అయిదురూపాయిల్ని ఇతంత కళ్ళతో చూశాడు. ఆ నోటుని గుప్పెట్లో బిగబట్టాడు. వెనక్కితిరిగి చూస్తూ, తిరిగిచూస్తూ వెళ్ళిపోయాడు.

బిచ్చగాని ప్రవర్తన గోపాల్రావుకి చికాకు కలిగించింది. తృప్తిగా భోజనం చేసేవాణ్నీ, డబ్బుసంపాదనే జీవితపరమావధిగా పెట్టుకున్నవాణ్నీ చూస్తేనే అతనికి కంపరం. ఇక ఈ బిచ్చగాడు పొట్టకోసం పశువులాగా అడలటం చూస్తే, మానవజాతిమీదే అసహ్యం కలిగింది- డబ్బు— ఈ అయిదు రూపాయిలు ఏంచేస్తాడు? తీసుకుపోయి భార్యకిస్తాడు. ఆమె తన్ను దీవిస్తుంది. పిల్లలంతా మూగుతారు... "ఎవరిచ్చారునాన్నా?" అని అడుగుతారు. బిచ్చగాడు తన్ను వర్ణిస్తాడు. అంతా తన్ను కొలుస్తారు. అకస్మాత్తుగా గోపాల్రావుకి ఆ దృశ్యం తనకళ్ళతో చూచి, ఆనందించాలని బుద్ధిపుట్టింది. వెంటనే బిచ్చగాణ్ణి అనుసరించాడు.

బిచ్చగాడు ఏదో దొంగిలించిన వానిలాగా బిత్తరిచూపులు చూస్తూ సందుగొందులు తిరిగాడు. ఒకచోట నిలబడి తన్నెవ్వరయినా చూస్తున్నారేమోనని అటూఇటూ చూశాడు. గోపాల్రావు సందుమలుపులో ఆగి, నక్కి-నక్కి చూశాడు. ఈ అనుభవం అతనికొక నూతనానందాన్ని కూర్చింది. తన్నుతా నేమరచిపోయి పరిశోధనలో పడిపోయాడు. బిచ్చగాడు కూనరాగాలు తీస్తూ రెండడుగులు ముందుకు వేసి, గబుక్కున పక్కింట్లో చొరబడ్డాడు. గోపాల్రావు ఆదుర్దాగావచ్చి ఆ యింటిముందు ఆగాడు. ఆ ఇల్లు చూశాడు. అతనికి గుండెలు దడదడ కొట్టుకున్నాయి. అలాగే చూస్తూ నిలబడిపోయాడు.

అది కల్లు అంగడి. లోపలనుంచి పాటలూ కేకలూ వినిపిస్తున్నాయి. ఆలోకంలో పాటకీ కేకకీ భేదం లేదు. స్వర్గానికీ నరకానికీ భేదం లేదు. మనుష్యుడికీ పశువుకీ భేదం లేదు. ఒకడు "డడ్డడడా అబనా తనామనా మారోరె భైరన్నా, డడ్డడడా, డడ్డడడా"

అని పాడుకుంటూ తూలుతూ వచ్చి గోపాల్రావు ముందు పడి పోయాడు. గోపాల్రావుకి భయంవేసింది. ఈపాటికి తన అయిదు రూపాయలనోటుమారిపోయివుంటుంది. ముంతమీదముంతఎగిరి పోతూ వుంటుంది. ఇందుకేనా తాను డబ్బిచ్చింది ? తన డబ్బు ఈవిధంగా వినియోగపడుతూవుందా ? దానాల ప్రయోజనం ఇదేనా ? ఈ ఆలోచనల్లో శిలాప్రతిమలాగు నిలబడిపోయాడు. కొంచం సేపటికి "డడ్డడడా, డడ్డడడా" అంటూ తూలుతూ బిచ్చగాడు బయటికి వచ్చాడు. గోపాల్రావుని చూచి, "తు... తు... తు... కోన్ హై" అన్నాడు. వెర్రిగా నవ్వాడు. ప్రపంచంలోని నూతన శక్తులన్నీ ఏకమై తన్నూ, తన దానాన్నీ చేసే హాస్యం ఆ వెర్రి నవ్వులో అతనికి కనిపించింది.

"తుం, బ... బ... బలాదూర్ హై" అని బిచ్చగాడే తన ప్రశ్నకు జవాబుచెప్పి, తూలుతూ తూలుతూ వెళ్ళిపోయాడు.

గోపాల్రావుకి మండిపోయింది. తన తెలివితక్కువ తనానికీ, అమాయకత్వానికీ బిచ్చగానిమీద కోపం వచ్చింది. తన్ను మోసం చేశాడు. తన్నేకాదు దాతృత్వాన్నే మోసంచేశాడు. ఏంచెయ్యటానికో తెలియదుగాని, బిచ్చగాని వెంటపడ్డాడు. ఈసారి బిచ్చగాడు ఎక్కడా ఆగలేదు. తూలుతూ ఆ రోడ్డునే పోయి, ఒక గుడిసెలో దూరాడు. గోపాల్రావు గబగబా వచ్చి గుడిసెవాకిట్లో ఆగాడు. లోపలనుండి ఏవో ధ్వనులు వినుపిస్తున్నాయి. సరిగా వినపడకపోవటంవల్ల గుమ్మందగ్గరకు వెళ్లాడు. పిల్లవాడొకడొచ్చి, "బాబూ వారం రోజుల్నించి దారకం లేదు..." అని మొదలు పెట్టాడు. అతనికి చిటచిటలాడింది. ఈ జనానికంతా ఇదేపాటా ! అందరికీ వారంరోజుల్నించేనా ?

ఇదొక వృత్తి. వృత్తిగా ఎందుకయింది? తనలాంటి మూర్ఖులున్నారు. తమ ఆత్మసంతృప్తికోసం ఈ కులాన్ని సృష్టించారు. ఆత్మానందానికి పోషిస్తున్నారు.

లోపలనుంచి మాటలు వినిపించినయి. "నామాట... నా మాట...ఇంటావా? ఇనవా?" అది బిచ్చగాని కంఠధ్వని అని గోపాల్రావు గుర్తించాడు.

"నా బాబు, నా బాబు" ఒక స్త్రీ ఏడుస్తూవుంది.

"తట్. నోరు ముయ్"

ఆ స్త్రీ ఏడ్పులు ఎక్కువయినయి. "కాలవొద్దు ... పసి గుడ్డు ... కళ్ళుంటే ఆడే బతుకుతాడు ... వొద్దు వొద్దు"

"ఛీ! ఎదవముండా! బతుకుతాడూ... సెప్పొచ్చావు? బతుకుతాడూ! నే బతకటం?" అని బిచ్చగాడు అరిచాడు. చంటిపిల్లి కెవ్వుమంది. తల్లి "బగమంతుడా!" కేక పెట్టింది.

గోపాల్రావు వొణికిపోయాడు. తల తిరిగిపోయింది. కోపంతో శరీరం ముచ్చెమటలు పోసింది. అడుక్కోటానికి–పసిపిల్లల కళ్ళు పొడిచేసి గుడ్డివాళ్ళని చేస్తారని అతడు విన్నాడు. రోషంతో శరీరం బిగదీసుకుపోయింది. బిచ్చగానికి తానిచ్చిన అయిదు రూపాయిలనోటు కళ్ళముందు తటతట కొట్టుకుంది. అమాంతంగా తలుపునెట్టుకొని లోపల ప్రవేశించాడు. అక్కడి దృశ్యం చూచేటప్పటికి అతనికి పిచ్చెత్తింది. బిచ్చగాడు కాళ్ళమీద పిల్లవాణ్ణి పడుకోబెట్టుకొని, పక్కనున్న, పొయ్యిలోనుంచి ఎర్రగా కాలిన ఇనపకడ్డీలు తీస్తున్నాడు. తల్లి రోదిస్తూ గుండెలు కొట్టుకుంటూ నిరోధిస్తూవుంది. పిల్లవాడు గిజ గిజ తన్నుకుంటున్నాడు.

గోపాల్రావు వొక్కసారి పక్కకిచూచాడు. పక్క నున్న బిచ్చగాని కర్ర తీసుకున్నాడు. ఇనపకడ్డీలు పిల్లవాడి కళ్ళదగ్గర కొచ్చినై. తల్లి కెవ్వుమన్నది. కుర్రవాడు కేకుమన్నాడు. గోపాల్రావు కర్ర పై కెత్తాడు. వంశపారంపర్యా తాము చేసిన దానాలపాపం, ఈ కులానికి తాము చేసిన అన్యాయం ఈ దెబ్బతో రద్దయిపోవాలనుకున్నాడు. కసీమని బిచ్చగాని నెత్తి మీద సత్తువకొద్దీ కొట్టాడు...

బిచ్చగాడు మరణించాడు. మర్నాడు పోలీసులు గోపాల్రావుని అరెస్టుచేసి తీసుకువెళ్ళారు. పద్ధ్నాలుగు సంవత్సరాలు జైలుశిక్ష విధించారు......

అతడు తన కథ ముగించి, వొక్క నిట్టూర్పు విడిచాడు. పద్ధ్నాలుగుసంవత్సరాలబాధ, యాతన ఆ వొక్క నిట్టూర్పులో కనిపించింది.

"మరి నువ్వు ప్రేమించినయువతి ఏమయింది?" నేనడిగాను.

అతడొక్క క్షణం మాట్లాడలేకపోయాడు—"జైల్నించి వచ్చినదగ్గరనుంచీ పార్కుకి వస్తున్నాను. ఈ బెంచీనే చూస్తూ కూర్చుంటున్నాను. ఇవ్వాళ ఆ బెంచీని నువ్వాక్రమించు కున్నావు. ఆక్రమించుకుని పదిసంవత్సరాల క్రింద నేచేసినపని చేశావు." అన్నాడు...

ఇదే బెంచీ! ఇక్కడే ఆ పిల్ల కూచుంది. ఇక్కడే వాళ్ళు తమ జీవితంలోని అమృతగడియలు గడిపారు. ఆ బెంచీమీదకూర్చోటానికి నాకు సిగ్గువేసింది. ఒకరి పవిత్ర ప్రేమజీవితంలో వేలు పెడుతున్నానా? అతనికీ అతని ప్రియురాలికీ మధ్య జేరుతున్నానా? అగస్మాత్తుగా అతడంటే నాకు అవ్యాజానురాగం